
# దేవత

సి.ఎస్. చంద్రశేఖర్



నారాయణ పరుగెత్తుతున్నాడు. పరుగెత్తుతూ వెనక్కి తిరిగి చూశాడు. వాళ్లు దూరంగా వస్తున్నారు. పరుగెత్తుతూ.. అరుస్తూ అతన్ని తరుముకొస్తున్నారు. నారాయణలో శక్తి సన్నగిల్లుతూంది. ఇక తను పరుగెత్తలేనేమోనన్న భయం మొదలైంది అతనిలో.

ఇంతలో అతనికి దూరంగా ఇళ్లు కనిపించాయి. అతనిలో ఆశ చిగురించింది. ఎలాగోలా ఆ కాస్త దూరం పరుగెత్తి ఏదో ఒక ఇంట్లో దాక్కుంటే, తను వీళ్ల బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. అదీ తన అదృష్టం బాగుంటేనే. ఇలా బహిరంగ ప్రదేశంలో ఎంతో సేపు తను పరుగెత్తలేక వీళ్ల చేతికి చిక్కడం ఖాయం! చిక్కితే మాత్రం తనకు ఇక భూమిపై నూకలు చెల్లిపోయినట్లే! అనుకున్నాడు.

ఊర్లోకి ప్రవేశించగానే సందు తిరిగి వెనక్కి చూశాడు. వాళ్లు ఆ సందు మలుపులోకి ఇంకా రాలేదు. వెంటనే ఓ ఇంటి కాంపౌండు గోడ ఎక్కి లోపలికి దూకాడు. దూకాక ఆ గోడ వైపు చూశాడు. చాలా ఎత్తుగా ఉంది. మామూలు స్థితిలో అంత పెద్ద గోడను ఎక్కే ప్రయత్నమే చేసి ఉండేవాడు కాదు. ఇప్పుడు ప్రాణభయంతో ఉన్నాడు కాబట్టి, సునాయాసంగా గోడ ఎక్కి ఇవతలికి దూకగలిగాను అనుకున్నాడు.

చుట్టూ చూశాడు. పెరడు చాలా పెద్దదిగా ఉంది. ఇల్లు మాత్రం చాలా చిన్నది. ఓ మూలగా కట్టెల మోపు, అక్కడక్కడా పూల చెట్లు, కూరగాయల చెట్లు ఉన్నాయి. ఓ మూల ఎర్ర మట్టితో కట్టిన గది ఉంది. పై కప్పు లేదు దానికి. ద్వారం ఉంది కాని తలుపు లేదు.

నారాయణ ఆ గదిలోకి అడుగు పెట్టాడు.

అక్కడ ఓ స్త్రీ స్నానం చేస్తూంది. నారాయణను చూడగానే గబుక్కున గోడ మీద ఉన్న చీర అందుకుని, వేగంగా ఒంటికి చుట్టుకుని "ఎవరు నువ్వు?"

నారాయణ రెండు చేతులూ జోడించి, "అరవకు, వాళ్లు నన్ను చంపటానికి వస్తున్నారు" అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

ఆమె తల పంకించింది. ఇంతలో కొంత మంది గోడ దూకిన శబ్దం వినిపించింది.

"ఎవర్రా ఆడ?" అరిచింది ఆమె.

"ముత్యాలూ, కోటిగాణ్ని చంపినోడు నీ ఇంట్లో దూరాడు. ఆణ్ని ఏసేయాలి ఈ రోజు" రంగా మాటలు వినిపించాయి ఆమెకు.

"ఇంట్లో సూడండి. ఉంటే తీసుకుపోండి. ఈడికి రాకండి. నేను సానం సేత్తున్నాను."

వాళ్లు ఇంటి వైపు పరిగెత్తిన శబ్దం వినిపించింది.

ముత్యాలు నారాయణ వైపు చూసి, తన వెనుక వచ్చి కూర్చోమని చెప్పింది.

అతనికి ఆమె ఎందుకలా చెప్పిందో అర్థం కాకపోయినా, చప్పుడు చెయ్యకుండా వచ్చి, ఆమె వెనుక మోకాళ్ల మీద వంగి కూర్చున్నాడు. ఆమె చుట్టుకున్న చీర ఆమె వెనుక

భాగాన్ని పూర్తిగా కప్పలేక పోతూంది. ఆమె వీపు, నడుము అనాచ్ఛాదితం గా అతనికి కనిపిస్తూన్నాయి. అయితే అతను ఆ అందాన్ని ఆస్వాదించే స్థితిలో లేడు. తన మెడ మీద తల ఉంటే చాలనుకుం టున్నాడు.

ఇంతలో రంగా లోపలికి వచ్చాడు. ముత్యాలును చూసి వెకిలిగా నవ్వాడు.

అతడు తన అనుచరులను పంపించి లోపలికి వచ్చాడని అర్థమైంది నారాయణకు. మరింత ముడుచుకుని కూర్చున్నాడు భయంగా.

“నాకు తెలుసురా నువ్వు ఈడికి వస్తావని” అంటూ, పక్కనే పొయ్యికి కట్టెలు కొయ్యటానికి ఉపయోగించే కొడవలి అందుకుని, “అడుగు ముందుకేస్తే ఏటవుద్దో తెలుసా? నీ చెయ్యి తెగుద్ది!” అంది రౌద్రంగా అతన్నే చూస్తూ.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఎ.ఐ.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

“ఛూ నీయవ్వ! నీ మొగుడూ వచ్చాడు. ఇంత అందం ఏం జేసుకుంటావే?” అంటూ విసురుగా బయటికి నడిచాడు రంగా.

అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. తర్వాత ముత్యాలు లేచి ఇంట్లోకి నడిచింది. తలుపు గడియ వేసి, దుస్తులు మార్చుకుని, నారాయణ దగ్గరకు వచ్చి “లోపలికి రా” అంది.

నారాయణ చుట్టూ భయంగా చూస్తూ, ఆమెని అనుసరించాడు. ఆ ఇంట్లో ఓ హాలు లాంటి ఓ చిన్న గది, ఆ గదికి ఆనుకుని మరో చిన్న గది ఉన్నాయి. ఆ చిన్న గది వంట గది అయి ఉండొచ్చు అనుకున్నాడు.

ఆమె ఆ గదిలో కెళ్లి ఓ గ్లాసులో నీళ్లు తెచ్చి అతనికిస్తూ “ఆళ్లు వెళ్లిపోయారులే. భయపడొద్దు” అంది. మంచం వాల్చి “కూర్చో” అంది.

నారాయణ కూర్చున్నాడు. ఆమె నేలపైనే కూర్చుంది.

**అతనికి ఆమె ఎందుకలా చెప్పిందో అర్థం కాకపోయినా, చప్పుడు చెయ్యకుండా వచ్చి, ఆమె వెనుక మోకాళ్ల మీద వంగి కూర్చున్నాడు. ఆమె చుట్టుకున్న చీర ఆమె వెనుక భాగాన్ని పూర్తిగా కప్పలేక పోతూంది. ఆమె వీపు, నడుము అనాచ్ఛాదితం గా అతనికి కనిపిస్తూన్నాయి. అయితే అతను ఆ అందాన్ని ఆస్వాదించే స్థితిలో లేడు. తన మెడ మీద తల ఉంటే చాలనుకుం టున్నాడు.**

నారాయణ ఆమెనే చూస్తుండిపోయాడు. మరీ అందంగా లేకపోయినా చూచే కొద్దీ ఆమెని చూడాలనిపిస్తూంది అతనికి. పొడవుకు తగ్గ లావుతో, చక్కటి అవయవసంపద తో ముచ్చటగా కనిపిస్తూంది అతనికి.

“ఏటయ్యా, మా ఊరి కోటిగాణ్ని సంపింది నువ్వేనా?” అతన్నే చూస్తూ అడిగింది.

“చంపలేదు. మా వాళ్లకు పట్టిచ్చాను.”

“నువ్వు జగపతి మడిసివా?”

అవునన్నట్టు తలూపాడు నారాయణ.

“అదేదో పాక్షన్ పాక్షన్ అంటారు. దాని కోసం ఒకర్నొకరు సంపుకుంటున్నారు. మా ఊరిలో సగం మంది ఆడాళ్లకు మొగు ళ్లు లేరు. అంతా పాక్షన్‌లో సచ్చిపోయారు. నా మొగుడూ దాని వల్లే సచ్చిపోయాడు. రంగా లాంటి ఎదవలు మా సుట్టూ తిరిగి మమ్మల్ని పక్కలోకి రమ్మని సతాయిస్తూంటారు. ఎందుకీ ఎదవ జన్మ సచ్చిపోవాలనిపిస్తుంది ఒక్కోసారి.” ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి.

“ఈ ఎదవలకు చంపేటప్పుడు ఎక్కడ లేని ఆవేశం, కసి వస్తది. ఆ పరిస్థితి వాళ్లకూ వస్తుందని అనుకోరు. అసలు మడిసికి ప్రాణం పోసేవాడు దేవుడు. ప్రాణం తీసే హక్కు ఆడికే ఉంది. మడిసంటూ పుట్టాక మరో మడిసిని ఆదుకోవాలే గాని సంప కూడదు. ఆ యిషయం యీళ్లకు ఎప్పుడు ఎరికవుతుందో?”

నారాయణ ఏం మాట్లాడలేదు. ఆమె మాటలు తనకూ వర్తిస్తాయని తెలుసు అతనికి. కాని ఇప్పుడు అతనేం చేయలేడు. ఫ్యాక్షన్ అనే ఊబిలో పూర్తిగా కూరుకుపోయాడు.

అతను గతం ఆలోచిస్తూండిపోయాడు.

000

“ఒరేయ్! మనం యిలాగే పల్లెలో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నించామంటే జీవితాంతం నిరుద్యోగులుగా మిగిలిపోతాం. మనం ఒకసారి జగపతి దగ్గరికెళ్లి మనకు ఉద్యోగం చూపించమని అడుగుదాం” జగన్నాథం నారాయణతో అన్నాడు.

“అమ్మో జగపతి దగ్గరికా? దూరం నుంచి ఆయన ఇల్లు చూస్తేనే నాకు దడగా ఉంటుంది. ఆయన యింటి లోపలికెళ్లి ఆయనతో మాట్లాడట మా? నా వల్ల కాదు బాబూ!” నారాయణ అన్నాడు.

“ఎందుకురా భయం? మనం చలపతి మనుషులైతే భయపడాలి. ఆయనకు అన్ని ఆఫీసుల్లోనూ పరిచయాలుంటాయి. మనకు సహాయం చేయమని అడుగుదాం. చేస్తే మంచిది. చేయకుంటే మన ప్రయత్నాలు మనం చేసుకుందాం.” జగన్నాథం నారాయణను బలవంతంగా ఒప్పించాడు.

జగపతి, వాళ్ల విన్నపం విన్నాక “తప్పకుండా మీకు ఉద్యోగం ఇప్పిస్తాను. అయితే యీ లోగా మీరు నాకో సహాయం చెయ్యాలి. నేను కాంట్రాక్ట్‌ల కోసం టెండర్లు వేస్తూంటాను. నా మనుషులకు భూముల కోసం, పక్కా ఇళ్ల కోసం ఆర్జీలు పెట్టిస్తుంటాను. మీరు సదూకున్నోళ్లు కాబట్టి ఆ విషయంలో నాకు సహాయం చేస్తూ నా దగ్గరే ఉండండి. నెలకు ఎంతో కొంత మీకు ఇస్తాను” అన్నాడు.

స్నేహితులిద్దరూ అందుకు ఒప్పుకున్నారు. అయితే జగపతి తమని బాగా ఉపయోగించుకుంటున్నాడని, తమ ఉద్యోగం గురించి అసలు ప్రయత్నమే చెయ్యడం లేదని, కొద్ది రోజుల్లోనే వారికి అర్థమైంది. అప్పటికే జగపతి మనుషులుగా వారిపై ముద్ర పడటంతో, ఒంటరిగా ఊర్లో తిరగడానికి భయపడేవారు. అతనికి దూరంగా వెళ్లిపోవడానికీ ధైర్యం చాల్లేదు వాళ్లకు. మంచి ఉద్యోగం వస్తే ఆ సాకుతో వెళ్లిపోవచ్చునుకుని, ఆ మంచి

రోజు కోసం ఎదురు చూడసాగారు.

అయితే ఆ ఆలోచనను వారి నుంచి దూరం చేసింది, ఓ సంఘటన. జగపతి తన కోసం సిటీ నుంచి అమ్మాయిలు పిలిపించేవాడు. వాళ్లతో అతను కొద్ది రోజులు జల్సాగా గడిపాక తిరిగి పంపించేసేవాడు. ఈ సారి వాళ్లను తన అనుచరులకు వదిలిపెట్టాడు. అందర్లోకీ నారాయణ అందంగా ఉండటంతో, ఆ అమ్మాయిలు అతనితో గడపడానికి ఇష్టపడేవారు. ఆ సుఖానికి అలవాటు పడ్డాక నారాయణ, ఇక జగపతిని వదలదలచుకో లేదు. అతను చెప్పిన పనులన్నీ చేస్తూ, జగపతికి ఇష్టమైన బంటు అయ్యాడు.

ఓ రోజు జగపతి, రెవెన్యూ ఆఫీసులో పని చేస్తున్న రాఘవయ్యను ఏదో భూమి విషయమై పిలిపించి మాట్లాడాడు. అతను చెయ్యమన్న పనులు అక్రమమైనవని, తాను అటువంటి పనులు చెయ్యలేనని తెగేసి చెప్పాడు రాఘవయ్య.

వాళ్లు మాట్లాడుకుంటున్న సమయంలో, పక్క గది నుంచి ఓ అమ్మాయి భుజంపై చెయ్యి వేసుకుని బయటకు వచ్చిన నారా యణ, తండ్రిని చూసి నిర్ఘాంతపోయాడు. రాఘవయ్య పరిస్థితీ అలాగే ఉంది. చేసి ఉద్ధరిస్తాడనుకున్న కొడుకు జగపతి లాంటి దుర్మార్గాన్ని పంచన చేరడం, అమ్మాయిల సుఖానికి మరగడం చూసి తట్టుకోలేకపోయాడు. లేచి నిలబడి పిచ్చివాని వలె చూస్తూ తడబడుతున్న అడుగులతో బయటకు నడిచాడు.

వాళ్లు మాట్లాడుకుంటున్న సమయంలో, పక్క గది నుంచి ఓ అమ్మాయి భుజంపై చెయ్యి వేసుకుని బయటకు వచ్చిన నారా యణ, తండ్రిని చూసి నిర్ఘాంతపోయాడు. రాఘవయ్య పరిస్థితీ అలాగే ఉంది. చేసి ఉద్ధరిస్తాడనుకున్న కొడుకు జగపతి లాంటి దుర్మార్గాన్ని పంచన చేరడం, అమ్మాయిల సుఖానికి మరగడం చూసి తట్టుకోలేకపోయాడు. లేచి నిలబడి పిచ్చివాని వలె చూస్తూ తడబడుతున్న అడుగులతో బయటకు నడిచాడు.

నారాయణ లోపలికి నడుస్తూంటే, "ఆ రాఘవయ్య నెల రోజులు మంచానబడి సెలవు పెట్టాలి. ఏర్పాట్లేవో చూడండి" అంటున్న జగపతి మాటలు వినిపించాయి.

తర్వాత జగపతితో, తన తండ్రికి ఎటువంటి అపకారం తలపెట్టవద్దని చెప్పడానికి ప్రయత్నించాడు నారాయణ. అయితే అతనికి చెప్పడానికి ధైర్యం చాల్లేదు.

నాలుగు రోజుల తర్వాత ఇంటికి వెళ్లిన నారాయణకు, ఇల్లు తాళం వేసి ఉండటం కనిపించింది. పక్కింటావిడ తాళం చెవి ఇచ్చింది. ఇంట్లో తల్లి రాసిన ఉత్తరం కనిపించింది అతనికి.

"ఒరేయ్ నారాయణా,

"పిల్లలు చదివినా, చదవకపోయినా మనుషుల్లా ప్రవర్తిస్తే చాలనుకుంటారు తల్లిదండ్రులు. నువ్వు రాక్షసుల్లో కలిసి పోయావని, నైతికవిలువలు కోల్పోయావని తెలిసిన క్షణం మీ నాన్న మనసు చెదిరింది. నా గుండె పగిలింది.

"మేము దూరంగా వెళ్లిపోతున్నాం. మా మనసుల్ని, శరీరాల్ని పూర్తిగా ఆ భగవంతుడి సే వ కే వినియోగించదలచుకున్నాం. కనీసం వచ్చే జన్మలోనైనా దేవుడు మంచి బిడ్డల్ని మాకు ప్రసాదిస్తాడేమో చూడాలి. మా కోసం వెతకొద్దు. దయచేసి కలలో కూడా మమ్మల్ని తలచొద్దు.

"-నిన్ను కన్న పాపాత్మురాలు."

ఉత్తరం చదివి అచేతనంగా కూర్చుండిపోయాడు నారాయణ. అతని కళ్లల్లో నీరు నిండింది. ముఖం అరచేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

అయితే ఒక విధంగా అతనికి రిలీఫ్ కూడా కలిగింది. జగపతి మనుషులు తన తండ్రికి ఎటువంటి అపకారం చెయ్యలేరన్న విషయం గుర్తొచ్చి కాస్త స్తిమితపడ్డాడు.

000

రాత్రి పదకొండు గంటలకు తలుపు తట్టిన శబ్దమైతే, తలుపు తీశాడు నారాయణ. ఎదురుగా కోటిగాడు నిలబడి ఉన్నాడు. అతడు చలపతికి ముఖ్య అనుచరుడు.

చటుక్కున తలుపు మూయబోయాడు నారాయణ. అయితే కోటిగాడి బలం ముందు, అతని ప్రయత్నం ఫలించలేదు. లోపలికి వచ్చిన కోటిగాడు తలుపు మూసి "నారాయణా! రాత్రికి నాకు ఆశ్రయమియ్యి. తెల్లవారు జామునే వెళ్లిపోతాను" అన్నాడు.


అతను తనను చంపడానికి రాలేదని తెలిశాక, నారాయణకు ధైర్యమొచ్చింది.

"కూర్చో. ఏమిటిలా మా ఊరికి వచ్చావు? మా ఊరి నిండా జగపతి మనుషులే అన్న విషయం మరచావా?" అన్నాడు కోటిగాడితో.

"తెలుసు. పక్క ఊరిలో నా భార్య ఉంది. ఆమె పుట్టిల్లు అక్కడుంది. ఆమెకు ఒంట్లో బాగులేకుంటే చూచి వస్తున్నాను. బండి టైరు పంచరైంది. ఈ ఊరి మనుషులు నన్ను చూస్తే ప్రాణాలతో వదలరు. అందుకే చదువుకున్నవాడివని, మంచి వాడివని నీ దగ్గరకు వచ్చాను."

"సరే, పడుకో. ఉదయం వెళ్లేటప్పుడు నన్ను లేపు."

హాల్లో



అతని పడక సిద్ధం చేసి ఇచ్చాడు నారాయణ. కొద్దిసేపట్లోనే కోటిగాడు గురక పెట్టి నిద్రపోయాడు. నారాయణకు నిద్ర రావటం లేదు. జగపతి మాటలే గుర్తుకొస్తున్నాయి అతనికి.

“మనకు రావాల్సిన కాంట్రాక్ట్‌లన్నీ ఆ చలపతిగాడికి దక్కుతున్నాయి. అందుకు కారణం కోటిగాడు. వాడు డబ్బులే ఇస్తున్నాడో, బెదిరిస్తూ పనులు చేయించుకుంటున్నాడో తెలియదు. వాడు ఉన్నంతవరకూ నాకు ఈ వ్యాపారంలో అన్నీ ఎదురుదెబ్బలే. మీలో ఎవరైనా వాణ్ని లేపేయండి. ఆ పని చేసినవాడికి లక్ష రూపాయలిస్తాను నేను.”

ఆ మాటలు జగపతి ఒకసారి అనలేదు. చాలా సార్లు అన్నాడు తన అనుచరులతో.

నారాయణ గదిలో కెళ్లి తలుపు మూసుకుని, తన సెల్ నుంచి జగపతికి ఫోన్ చేశాడు. పావు గంట తరువాత తలుపు బాదుతున్న శబ్దం విని, ఉలిక్కిపడి లేచాడు. కోటిగాడు. అప్పటికే నారాయణ తలుపులు తెరవడం, పదిమంది మనుషులు కోటిగాణ్ని చుట్టుముట్టడం జరిగిపోయాయి.

వాళ్లు అతన్ని లాక్కెళుతూంటే కోటిగాడు, నారాయణవైపు చూశాడు. ఆ చూపులో అసహ్యం, నమ్మకద్రోహం చేశాడన్న బాధ, చావు గురించి భయం కలగలిసి కనిపించాయి. అతని వైపు చూడలేక తల దించుకున్నాడు నారాయణ.

ఎదురుగా ‘కోటిగాడి’ ఫోటో. పెద్ద సైజులో ఫ్రేమ్ వేయబడి గోడకు తగిలించి ఉంది. ఫోటోలో అతని కళ్లను చూస్తూంటే, ఆ రోజు అతని జగపతి మనుషులకు పట్టిచ్చినప్పుడు చూసిన చూపు గుర్తొచ్చింది. ‘మళ్లీ మోసం చేస్తున్నావా?’ అని తనను అతను నిలేసి అడుగుతున్నట్లనిపించింది నారాయణకు, ఆ కళ్లను చూస్తూంటే.

మరుసటి రోజు ఉదయమే కోటిగాడు హత్య చేయబడ్డాడన్న వార్త, చుట్టు పక్కలున్న ఊర్లోని జనాలను భయపెట్టింది. చలపతి, జగపతిపై తన అనుమానాన్ని విలేఖరులకు, పోలీసులకు చెప్పాడు. జగపతి ఆ విషయాన్ని ఖండించాడు. నారాయణ గొడవలు సద్దుమణిగేంతవరకూ జగపతి ఇంట్లో తల దాచుకున్నాడు.

అన్నట్టుగానే లక్ష రూపాయలు నారాయణకు కానుకగా ఇచ్చాడు జగపతి. ఆ డబ్బు, అతనికి ఓ భార్యను సంపాదించి పెట్టింది.

000

భార్యకు పురిటినొప్పులు మొదలయ్యాయని కబురు రావడంతో, అత్తగారి ఊరికి బస్సులో బయలుదేరాడు నారాయణ. దారిలో బస్సు టైరు పంచరైంది. డ్రైవరు టైరు మారుస్తూంటే బస్సు దిగి ఓ చెట్టు కింద నిలబడి సిగరెట్ ముట్టించాడు నారాయణ. అప్పుడే అటుగా జీపులో వెళ్లున్న రంగా, అతని మనుషుల కంట్లో పడ్డాడు. వెంటనే నారాయణ పరుగు లంకించున్నాడు. వాళ్లు జీపు దిగి అతన్ని వెంబడించారు. ‘ముత్యాలు మంచితనం వల్ల, సమయస్ఫూర్తి వల్ల తను ఇంకా బతికే ఉన్నాడు’ అనుకున్నాడు నారాయణ.

ముత్యాలు మధ్యాహ్నం రెండు గంటలకు అతనికి భోజనం వడ్డించింది. ఈ ఫ్యాక్షన్లు, కక్షలు, హింస వదిలిపెట్టి, దూరంగా ఏ సిటీకో వెళ్లిపోయి భార్యాపిల్లలతో హాయిగా కాలం గడపమని, కూలీ, నాలీ చేసుకున్నా తృప్తిగా, నిశ్చింతగా బ్రతకవచ్చని అతనికి హితవు పలికింది. తర్వాత తను భోంచేసింది.

“కాసేపు పడుకో. చీకటి పడ్డాక బయలుదేరి మీ ఊరు చేరుకుందువులే” అంది నేలపై చాప పరుస్తూ.

నారాయణ పడుకున్నాడు. కాని భయం వల్ల నిద్ర రాలేదు అతనికి. ముత్యాలు కొంత దూరంలో పడుకుని నిద్రపోతూంది. చాలాసేపు ఆమెనే చూస్తూండిపోయాడు. నిద్రలో ఆమె మరింత అమాయకంగా కనిపిస్తూంది. ఉదయం స్నానాల గదిలో ఆమె స్నానం చేస్తూ కనిపించిన దృశ్యం అతని కళ్ల ముందు మెదిలింది. అతని మనసు తీయగా మూలిగింది.

బలవంతంగా కళ్లు మూసుకుని పడుకున్నాడు. అతనికే తెలియకుండా నిద్రలోకి జారిపోయాడు.

000

ముత్యాలు తట్టి లేపుతూంటే మెలకువ వచ్చింది నారాయణకు. కళ్లు నలుపుకుంటూ లేచి కూర్చున్నాడు.

“గంట ఏడైంది. ఇక బయలుదేరు.”

లేచి నిల్చుని “బయట ఎవరూ లేరుగా?” అని అడిగాడు.

“ఎవరూ లేరు. పట్నంలో మినిస్టర్ మీటింగ్ ఉందట. మడిషికి రెండు వందలు యిస్తామంటే మా ఊరి మగాళ్లంతా వెళ్లారు. మీటింగ్ అయిపోయాక వాళ్లు తాగి తందనాలాడి వచ్చేసరికి అర్ధరాత్రవుతుంది. ఆ లోగా నీవు మీ ఊరు చేరిపో.”

నారాయణ బయటకు వచ్చాడు. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. భయంభయంగా చుట్టూ చూస్తూ నడవసాగాడు. కొంత దూరం నడిచాక వెనక్కి తిరిగి చూశాడు. ముత్యాలు ఇల్లు కనబడుతూం ది. అతని మనసులో అందమైన ముత్యాలు రూపం మెదిలింది.

ఉన్నట్టుండి అతనికో ఆలోచన వచ్చింది. “ముత్యాలు ఒంటరి ఆడది. ఊళ్లో మగవాళ్లెవ్వరూ లేరు. ఆమె ఇల్లు మిగతా ఇళ్లకు కాస్త దూరంగా ఉంది. తను వెళ్లి ఆమెను అనుభవిస్తే? ఆమె అరచి గోల చేసినా ఎవ్వరికీ వినపడదు అనుకున్నాడు.

ఆ ఆలోచన రావడంతోనే అతనిలో అంత వరకూ ఉన్న భయం మాయమైంది. మనసు ఉత్సాహంతో ఉరకలు వెయ్యసాగింది. ముత్యాలు ఇంటి తలుపు దగ్గరగా వేసి ఉంది.

“ఈ రోజు నా టైము బాగుంది” అనుకుంటూ తలుపు తెరచి లోపలికి అడుగుపెట్టాడు. ఆమె హాల్లో కనిపించలేదు. వంట గదిలోకి వెళ్లి షాక్ తిన్నట్టు నిలబడిపోయాడు.

ఎదురుగా ‘కోటిగాడి’ ఫోటో. పెద్ద సైజులో ఫ్రేమ్ వేయబడి గోడకు తగిలించి ఉంది. ఫోటోలో అతని కళ్లను చూస్తూంటే, ఆ రోజు అతని జగపతి మనుషులకు పట్టిచ్చినప్పుడు చూసిన చూపు గుర్తొచ్చింది.

‘మళ్లీ మోసం చేస్తున్నావా?’ అని తనను అతను నిలేసి అడుగుతున్నట్లనిపించింది నారాయణకు, ఆ కళ్లను చూస్తూంటే.

గిరుక్కున వెనక్కి తిరిగి బయటకు నడిచాడు నారాయణ. ■